క్లుప్తంగా

చెరువును తలపిస్తున్న రైల్వే బ్రిడ్జి



ఫత్తేపూర్ రైల్వే బ్రిడ్జి కింద నిలిచిన వర్షపునీరు

శంకర్‌పల్లి: సోమవారం కురిసిన వర్షానికి మున్సిపాలిటీ పరిధిలోని ఫత్తేపూర్ రైల్వే బ్రిడ్జి చెరువును తలపించింది. బ్రిడ్జి కింద వర్షపు నీరు వెళ్లేందుకు సరైన మార్గం ఏర్పాటు చేయకపోవడంతో భారీ ఎత్తున వరదనీరు నిలిచింది. దీంతో రాకపోకలు సాగించేందుకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అధికారులు స్పందించి, శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు.

కరాటే పోటీల్లో ప్రతిభ



ప్రతిభ కనబర్చిన విద్యార్థులతో మాస్టర్లు

షాద్‌నగర్: శ్రీహనుమాన్ కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా వారి ఆధ్వర్యంలో సోమవారం మహబూబ్‌నగర్‌లోని రోజీ గార్డెన్ ఫంక్షన్‌హాల్‌లో 4వ జాతీయ కరాటే అండ్ కుంగ్‌ఫూ ఛాంపియన్ షిప్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పట్టణానికి చెందిన న్యూపవర్ కుంగ్‌ఫూ అకాడమీ విద్యార్థులు రాహుల్, చేతన్, ప్రేమ్ పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచి మొదటి స్థానం సాధించినట్లు మాస్టర్లు బాల్‌రాజ్, అహ్మద్‌ఖాన్ తెలిపారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు మెడల్స్‌తో పాటు ప్రశంసా పత్రాలు అందజేశారు.

మార్మోగిన శివనామస్మరణ



పుష్పార్చన నిర్వహిస్తున్న అర్చకులు

మొయినాబాద్‌రూరల్: మండలంలోని కనకమామిడి సమీపంలో గల సంగమేశ్వర దేవాలయంలో శ్రావణమాసం మూడో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో శివలింగానికి పుష్పార్చనతో పాటు ప్రత్యేక పూజలు చేశారు. వివిధ గ్రామాల నుంచి వేలాది మంది భక్తులు తరలి రావడంతో ఆలయ ప్రాంగణం శివనామస్మరణతో మార్మోగింది. అర్చకులు విచ్చేసిన భక్తులకు దైవదర్శనంతో పాటు తీర్థప్రసాదాలు అందించారు. అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం



బాధిత కుటుంబ సభ్యులకు నగదు అందజేస్తున్న సంఘం సభ్యులు

షాబాద్: బాధిత కుటుంబానికి సాయిచైతన్య యువజన సంఘం అండగా ఉంటుందని సంఘం అధ్యక్షుడు ఎండీ ఇనాయత్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని బోడంపహాడ్‌లో ఎన్కపల్లి రాంచంద్రయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. నిరుపేద కుటుంబం కావడంతో అంత్యక్రియల నిమిత్తం సంఘం తరఫున రూ.10,500లు బాధిత కుటుంబ సభ్యులకు అందించారు. నిరుపేద కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకునేందుకు తమవంతు కృషి చేస్తామని వారు స్పష్టం చేశారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు రఫీక్, మల్లేశ్, శ్రీకాంత్ రెడ్డి, శ్రీనివాస్, శ్రీధర్, శివ, నితీష్ తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహం



హెచ్‌ఎంకు నగదు అందజేస్తున్న నాయకులు

షాద్‌నగర్: పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సోమవారం బీఆర్‌ఎస్ నేత వంకాయల నారాయణరెడ్డి తన తల్లి జ్ఞాపకార్థం ప్రథమ వర్ధంతిని పురస్కరించుకొని నగదు ప్రోత్సాహకాన్ని అందజేశారు. నియోజకవర్గంలోని 38 జిల్లా పరిషత్ పాఠశాలల్లో 10వ పరీక్షా ఫలితాల్లో మొదటి, రెండో ర్యాంకు సాధించిన విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.5వేల చొప్పున రూ.1లక్షా 90వేల నగదు అందించడానికి ముందుకొచ్చాడు. దీనికి సంబంధించిన నగదు మొత్తాన్ని ఆయా పాఠశాలల హెచ్‌ఎంలకు అందజేశారు. ఆగస్టు 15వ తేదీన విద్యార్థులకు అందజేయనున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ మనోహర్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు ఎంఎస్ నటరాజన్, మాజీ కౌన్సిలర్ యాదగిరి పాల్గొన్నారు.

పనులు సాగవు.. వెతలు తీరవు

- శంషాబాద్–కొత్తూరు రహదారిపై నిత్యం ట్రాఫిక్ జామ్
- కూడళ్ల మూసివేత, రోడ్డు విస్తరణ ఆలస్యంతో ఇబ్బందులు
- నరకయాతన పడుతున్న వాహనదారులు



యూటర్న్ కారణంగా పెంజర్ల కూడలిలో ట్రాఫిక్ జామ్

కొత్తూరు: శంషాబాద్–కొత్తూరు జాతీయ రహదారిపై నుంచి నిత్యం వేల సంఖ్యలో వాహనాలు రాకపోకలు కొనసాగిస్తుండగా.. మరోవైపు అదే రోడ్డు విస్తరణ పనులు మూడు అడుగులు ముందుకు వెళ్తే ఆరు అడుగులు వెనక్కి అన్న చందంగా సాగుతున్నాయి. దీంతో ఆ రూట్లో నిత్యం ట్రాఫిక్ జామ్ కారణంగా ఉద్యోగులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఓ వైపు రహదారి విస్తరణ పనులు మరోవైపు పెరిగిన వాహనాల రద్దీ కారణంగా ట్రాఫిక్ జామ్ ఏర్పడకుండా చర్యలు తీసుకుంటున్నప్పటికీ ఇబ్బందులు తప్పడం లేదు.

అత్యవసర సమయాల్లో తప్పని ఇబ్బందులు..

గత కొన్ని నెలలుగా కొత్తూరు టూ శంషాబాద్ వరకు జాతీయ రహదారిపై ఎప్పుడు ఎక్కడ ట్రాఫిక్ జామ్ ఏర్పడుతుంతో తెలియని పరిస్థితి నెలకొంది. తరచూ ఏర్పడుతున్న ట్రాఫిక్ జామ్‌లో అనుకోకుండా అత్యవసర పరిస్థితుల్లో ఆస్పత్రులకు రోగులను తరలించే అంబులెన్సులు ఇరుక్కుపోతున్నాయి. ఆయా పనుల నిమిత్తం శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు వెళ్లే వాహనాలు, ప్రజలు ట్రాఫిక్ జామ్ కారణంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని కూడళ్లలో నెమ్మదిగా వాహనాలు కదిలే సమయంలో ప్రమాదాలు సైతం చోటు చేసుకుంటున్నాయి.



వైజంక్షన్ కూడలిలో ట్రాఫిక్ జామ్

కూడళ్ల వద్ద ట్రాఫిక్ జామ్..

- శంషాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్‌కు కూతవేటు దూరంలో జాతీయ రహదారి పక్కనే ఉన్న దర్గాను దర్శించుకోవడానికి భక్తులు వాహనాలను రోడ్డు పక్కనే నిలుపుతున్నారు. ప్రతీ ఆదివారం భక్తుల రద్దీ విపరీతంగా ఉంటుంది. పదుల సంఖ్యలో వాహనాలు రోడ్డు పక్కనే పార్కింగ్ చేస్తుండడంతో శంషాబాద్ వైపునకు వచ్చే వాహనాలు ముందుకు కదల్లేని పరిస్థితి నెలకొంటుంది.
- కొత్తూరు నుంచి శంషాబాద్ వచ్చే రోడ్డులో మదనపల్లి వద్ద వాహనాలు యూటర్న్ తీసుకుంటున్నాయి. ఈ ప్రాంతంలో రోడ్డు వెడల్పు తక్కువగా ఉండడంతో శంషాబాద్ వైపునకు వచ్చే వాహనాలు భారీ సంఖ్యలో నిలిచిపోతున్నాయి.
- కొత్తూరు నుంచి శంషాబాద్ వెళ్లే రోడ్డులో పాలమాకుల కూడలి వద్ద వాహనాల రద్దీ కారణంగా తరచూ ట్రాఫిక్ జామ్ ఏర్పడుతోంది. దీంతో కూడలి వద్ద రోడ్డుకు ఇరువైపులా వాహనాలు నిలిచిపోతున్నాయి.
- కొత్తూరు మున్సిపల్ పరిధిలోని తిమ్మాపూర్ చౌరస్తా, చేగూరు రోడ్డులో వాహనాలు యూటర్న్ తీసుకుంటాయి. ఈ కూడళ్లలో కూడా రోడ్డు ఇరుకుగా ఉండడంతో వెనకాల నుంచి వచ్చే వాహనాలు ముందుకు వెళ్లేలేక ఎక్కువగా ట్రాఫిక్ జామ్ అవుతోంది.
- ప్రమాదాల నివారణలో భాగంగా పోలీసులు కొత్తూరు పట్టణంలోని జాతీయ రహదారిపై వైజంక్షన్ కూడలిని మూసివేశారు. దీంతో షాద్‌నగర్‌కు వెళ్లే వాహనాలు పెంజర్ల రోడ్డులో యూటర్న్ తీసుకొని పట్టణం గుండా వెళ్లాల్సి వస్తోంది. దీంతో ట్రాఫిక్‌జామ్ పెరుగుతోంది.

చర్యలు తీసుకుంటున్నాం

కొత్తూరు–శంషాబాద్ వరకు ప్రస్తుతం జాతీయ రహదారి విస్తరణ పనులు కొనసాగుతున్నాయి. దీంతో పలు కూడళ్ల వద్ద రోడ్డు ఇరుకుగా మారింది. వాహనాల రద్దీ ఎక్కువగా ఉన్న సమయాల్లో ట్రాఫిక్ జామ్ ఏర్పడుతోంది. ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించడానికి పోలీసు సిబ్బంది చర్యలు తీసుకుంటున్నారు. వాహనదారులు స్వచ్ఛందంగా ట్రాఫిక్ నియంత్రణ పాటించాలి.

– చంద్రశేఖర్, ట్రాఫిక్ సీఐ, షాద్‌నగర్

స్థానిక ఎన్నికల్లో సత్తాచాటాలి

మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు



హరీశ్‌రావుతో మండల నాయకులు

చేవెళ్ల: రాబోయే స్థానిక ఎన్నికల్లో బీఆర్‌ఎస్ సత్తాచాటే విధంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. నగరంలోని ఆయన నివాసంలో సోమవారం బీఆర్‌ఎస్ పార్టీ మండల నాయకులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. స్థానిక ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీని గెలిపించుకునేందుకు కష్టపడి పనిచేయాలని సూచించినట్లు తెలిపారు. ప్రజలు బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని మళ్లీ రావాలని కోరుకుంటున్నారని, ప్రజలకు పార్టీ అండగా ఉంటుందనే నమ్మకాన్ని కలిగించేలా పనిచేయాలన్నారు. తప్పకుండా రాష్ట్రంలో మళ్లీ బీఆర్‌ఎస్ పార్టీకే అవకాశం ఉందని, పార్టీ కోసం పనిచేసిన వారికి తగిన గుర్తింపు ఉంటుందని తెలిపారు. ఆయనను కలిసిన వారిలో మండల పార్టీ అధ్యక్షుడు పి. ప్రభాకర్, మైనార్టీ అధ్యక్షుడు అబ్దుల్ గని, నియోజకవర్గ సోషల్ మీడియా ఇన్‌చార్జి రవికుమార్, మల్కాపూర్ గ్రామ పార్టీ అధ్యక్షుడు మజర్, నాయకులు పురుషోత్తం, మాజీ ఉపసర్పంచ్ జాఫర్, ఇక్రమ్, ఇమ్రామన్, అస్లాం తదితరులు ఉన్నారు.

రైతుబీమా దరఖాస్తుల స్వీకరణ



చేవెళ్ల: రైతువేదిక వద్ద దరఖాస్తులు స్వీకరిస్తున్న వ్యవసాయ విస్తరణ అధికారులు

చేవెళ్ల: రైతుబీమాకు అర్హులైన రైతులందరూ దరఖాస్తు చేసుకోవాలని వ్యవసాయ విస్తరణ అధికారులు సూచించారు. సోమవారం చేవెళ్లలోని రైతు వేదిక వద్ద అధికారులు రైతుల నుంచి రైతు బీమా దరఖాస్తు ఫారాలను స్వీకరించారు. ఈ దరఖాస్తుకు ఈ నెల 13న చివరి తేదీ కావటంతో కొత్తగా పాస్‌బుక్‌లు వచ్చిన రైతులు వారి వారి దరఖాస్తులను అందజేసేందుకు పెద్దసంఖ్యలో వచ్చారు. మండలంలోని రైతులు 2025 జూన్ 5 నాటికి కొత్తగా పాస్‌పుస్తకాలు వచ్చినవారు రైతు బీమాకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉందని.. సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గతంలో దరఖాస్తులు చేసుకున్న రైతులు కూడా ఏమైనా మార్పులు చెర్పులు ఉంటే కూడా దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా రైతుల నుంచి వచ్చిన దరఖాస్తులను స్వీకరించి నమోదు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓలు బాలకోటేశ్వర్, స్వాతి, రమ్య, మౌనిక, ప్రతిభ తదితరులు ఉన్నారు.

దరఖాస్తులకు 13వ తేదీ ఆఖరు

షాద్‌నగర్‌రూరల్: ప్రభుత్వం అమలు చేస్తున్న రైతుబీమా పథకానికి అర్హులైన రైతులు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి(ఏఓ) నిషాంత్‌కుమార్ అన్నారు. సోమవారం పట్టణంలోని వ్యవసాయశాఖ కార్యాలయంలో ఏఓ నిషాంత్‌కుమార్ విలేకరులతో మాట్లాడుతూ.. భూ భారతి పోర్టల్‌లో 2025 జూన్ 5 వరకు కొత్తగా పట్టా పాస్‌బుక్ వచ్చిన రైతులు రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 18 సంవత్సరాలనుండి 59 సంవత్సరాల వయస్సు ఉన్న రైతులు అర్హులన్నారు. దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 13వరకు అవకాశం ఉంటుందని తెలిపారు. దరఖాస్తు ఫారంతో పాటుగా రైతు ఆధార్‌కార్డు జిరాక్స్, భూమి పాసుబుక్ జిరాక్స్, నామినీ ఆధార్‌కార్డు జిరాక్స్ పత్రాలను జత చేసి అందుబాటులో ఉన్న ఏఈఓలకు అందజేయాలని తెలిపారు.

రైతుబీమా పథకానికి దరఖాస్తు చేసుకోవాలి

షాబాద్: మండలానికి సంబంధించిన కొత్త పట్టాదార్ పాస్‌బుక్ వచ్చిన రైతులు రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి కృష్ణమోహన్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. కొత్తగా దరఖాస్తు చేసుకునేవారు రైతుబీమా దరఖాస్తు ఫారం, నామినేషన్ ఫారం, పట్టా పాస్‌బుక్ జిరాక్స్, రైతు ఆధార్‌కార్డు, నామినీ ఆధార్ కార్డు తీసుకొని పట్టాదారుడు స్వయంగా క్లస్టర్ వ్యవసాయ విస్తరణ అధికారికి దరఖాస్తులు అందజేయాలన్నారు. ఈ నెల 13వ తేదీవరకు దరఖాస్తులకు అవకాశం ఉందని అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పరిశుభ్రతతో వ్యాధులు దూరం

పీహెచ్‌సీ వైద్యురాలు దీప్తి



పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న వైద్యురాలు

కొత్తూరు: వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటిస్తేనే ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉంటారని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు దీప్తి అన్నారు. జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవంలో భాగంగా ఆమె సోమవారం కొత్తూరు పట్టణంలోని ప్రభుత్వ, కేజీబీవీ విద్యార్థులకు నులిపురుగుల నిర్మూలన మాత్రలను పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. చిన్నారులు, విద్యార్థులు భోజనం చేసే ముందు తప్పకుండా చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలన్నారు. నిల్వ చేసిన ఆహారం కాకుండా అప్పుడే వండిన ఆహారం తినడం మంచిదన్నారు. చేతులు శుభ్రం చేసుకోకుండా తినడంతో నులిపురుగుల బారిన పడే అవకాశం ఉందన్నారు. కడుపులో నులిపురుగులు ఉంటే సరైన శారీరక ఎదుగుదల ఉండదన్నారు. అంతేకాకుండా రక్తహీనత, తరచూ అనారోగ్యాల బారినపడే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ అంగూర్‌నాయక్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యలను పరిష్కరించాలి

అధికారులను ఆదేశించిన ఎమ్మెల్యే



ఇంటిగ్రేటెడ్ స్కూల్ స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కొందుర్గు: మండలంలో నెలకొన్న రెవెన్యూ సమస్యలను పరిష్కరించేందుకు వెంటనే చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అధికారులను ఆదేశించారు. సోమవారం మండల తహసీల్దారు కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ సరితతో కలిసి అధికారుల సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. రెవెన్యూ కార్యాలయంలో సిబ్బంది కొరత లేకుండా చూడాలని, రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తుల వివరాలను, రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన స్థలాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తులను త్వరలోనే పరిష్కరించాలన్నారు. రేషన్‌కార్డు లేని నిరుపేదలకు కొత్త రేషన్‌కార్డులను మంజూరు చేయాలని, కొత్తవారికి అవకాశం కలిస్తూ మార్పులు చేర్పులు చేయాలన్నారు. ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం పనులను 15 రోజులలో ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం అధికారులు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దారు రమేశ్, ఇన్‌చార్జి ఎంపీడీఓ గణపతి, విక్రమ్, ఆంజనేయులు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

యజ్ఞంతో సుఖశాంతులు కలుగుతాయి

ఆర్యప్రతినిధిసభ తెలుగు రాష్ట్రాల ప్రధాన్ విఠల్‌రావుఆర్య



యజ్ఞంలో పాల్గొన్న భక్తులు

కొందుర్గు: యజ్ఞాలు, యాగాలు వంటి దైవ కార్యక్రమాలను చేపట్టడంతో మానవులకు సుఖశాంతులు కలుగుతాయని ఆర్యప్రతినిధిసభ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ప్రధాన్ విఠల్‌రావుఆర్య అన్నారు. శ్రావణమాసాన్ని పురస్కరించుకొని సోమవారం జిల్లేడ్‌చౌదరిగూడ మండలం కేంద్రంలోని ఆర్యసమాజంలో యజుర్వేద పారాయణ యజ్ఞం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విఠల్‌రావుఆర్య హాజరై యజ్ఞాన్ని జరిపించారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలందరూ దైవ కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని సూచించారు. ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. యజ్ఞం చేయడంతో వాతావరణంలో సమతుల్యత ఏర్పడి కాలుష్య నివారణ జరుగుతుందని, సకాలంలో వర్షాలు కురుస్తాయన్నారు. ప్రజలందరూ యజ్ఞ, యాగాదులను చేపట్టి ప్రశాంత జీవనాన్ని గడపాలన్నారు. అనంతరం విఠల్‌రావుఆర్యను నిర్వాహకులు శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆర్యసమాజ్ ప్రధాన్ మచ్చ సుధాకర్‌రావు, అరవింద్‌శాస్త్రి, వసుధాశాస్త్రి, కోనేరు నర్సింగ్‌రావు, పుర్ర చిన్నయ్య, గంగ బస్వరాజు, వర్కల శివరాజు, మురళి, పోగుల స్వామి, బుగ్గయ్య, యాదయ్య, వేణు, పెంటయ్య, ప్రభు తదితరులు పాల్గొన్నారు.

దేవాలయానికి విరాళం అందజేత



నగదు అందజేస్తున్న మల్లికార్జున్

షాద్‌నగర్: ఫరూఖ్‌నగర్‌లోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయ అభివృద్ధికి పట్టణానికి చెందిన మంత మల్లికార్జున్ కుమారుడు మంత సాయిదత్త రూ.51వేలు ప్రకటించాడు. ఈ మేరకు సోమవారం మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింలుకు ఆయన విరాళానికి సంబంధించిన నగదు అందజేశాడు. కార్యక్రమంలో భిక్షపతి, రాంభూపాల్ పాల్గొన్నారు.

డిమాండ్ ఉన్న పంటలతోనే మేలు

భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గజేందర్‌గౌడ్

చేవెళ్ల: రైతులు ముందుగానే మార్కెట్‌లో డిమాండ్లను పరిశీలించుకొని పంటలు సాగుచేస్తే నష్టాలను నివారించుకునే అవకాశం ఉంటుందని భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గడిగే రాజేందర్‌గౌడ్ అన్నారు. మండల కేంద్రంలో మార్కెట్ కార్యాలయం వద్ద సోమవారం మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలను సాగు చేసుకుంటేనే రైతులకు మేలు జరుగుతుందని, దీనిని రైతులు గమనించేలా అవగాహన కల్పించాలన్నారు. రైతులు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలపై ఐక్యంగా పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. మండలంలోని గుండాల, కమ్మెట తదితర గ్రామాల్లో సమస్యలపై విద్యుత్ ఏడీ, ఏఈలతో చర్చించి పరిష్కరించాలని సంఘం తరఫున కోరామన్నారు. రాబోయే బలరామ జయంతి రోజు రైతు దినోత్సవం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని సమావేశంలో చర్చించారు. విద్యుత్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ విద్యుత్ ఏఈకి వినతిపత్రం సైతం అందజేశారు. రైతుల సమస్యలపై భారతీయ కిసాన్ సంఘ్ ఎప్పుడు పోరాడుతుందన్నారు. సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు సత్యనారాయణరెడ్డి, కోశాధికారి పెంటారెడ్డి, మండల కార్యదర్శి విశ్వనాథం, గుండాల, కుమ్మెర, కమ్మెట గ్రామలకు చెందిన రైతులు, భారతీయ కిసాన్ సంఘ్ సభ్యులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి

ఏబీవీపీ శంషాబాద్ కన్వీనర్ సూర్యప్రకాశ్

చేవెళ్ల: విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఏబీవీపీ ఎల్లప్పుడూ కృషి చేస్తుందని ఏబీవీపీ శంషాబాద్ కన్వీనర్ కల్లెం సూర్యప్రకాశ్ అన్నారు. మండలంలోని వివేకానంద కళాశాలలో సోమవారం ఏబీవీపీ నగర కార్యదర్శి కుర్వ మహిపాల్ ఆధ్వర్యంలో కార్యవర్గ సమావేశం నిర్వహించి.. నూతన కమిటీని ఎంపిక చేశారు. ఈ సందర్భంగా పాల్గొన్న అయన మాట్లాడుతూ.. ఏబీవీపీ ఏర్పడిన 75 సంవత్సరాల కాలంగా విద్యారంగ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తూ.. అతిపెద్ద విద్యార్థి సంఘంగా ఎదిగిందన్నారు. ఈ సందర్భంగా ఏబీవీపీ చేవెళ్ల నగర అధ్యక్షుడిగా శివకుమార్, నగర కార్యదర్శిగా హారిక, ఉపాధ్యక్షులుగా హర్షిత, అనిల్, హరికృష్ణ, మహేశ్వరి, సంయుక్త కార్యదర్శులుగా శిరీష, ఆకాశ్, ప్రశాంత్, ఎస్‌ఎఫ్‌డీ కన్వీనర్లుగా జైపాల్, మణిచందన్, ఎస్‌ఎఫ్‌ఎస్ కన్వీనర్లుగా మల్లేశ్, వెంకటేశ్, అక్షయ్, బాలికల కన్వీనర్లుగా పావని, ప్రవళిక, సభ్యులను ఎంపిక చేసినట్లు ప్రకటించారు.

విద్యార్థుల ఆరోగ్యమే లక్ష్యం



కేశంపేట: చిన్నారికి మాత్రలు వేస్తున్న వైద్యాధికారి నిఖిత

మొయినాబాద్‌రూరల్: విద్యార్థులు ఆరోగ్యంగా ఉన్నప్పుడే విద్యాబుద్ధులతో పాటు విజ్ఞానాన్ని పెంపొందించుకుంటారని బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు దారెడ్డి వెంకట్‌రెడ్డి, మండల వైద్యాధికారి ఫిర్‌దోషి అన్నారు. మండల పరిధిలోని కేతిరెడ్డిపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేసే కార్యక్రమాన్ని పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాస్‌గౌడ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వారు పాల్గొని విద్యార్థులకు మాత్రలు అందజేశారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం కవిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మండలంలో 8,032 మంది చిన్నారులకు..

కేశంపేట: మండలంలోని అన్ని పాఠశాలల్లో సోమవారం వైద్యాశాఖ ఆధ్వర్యంలో 1 నుంచి 19 ఏళ్ల వారికి నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేశారు. మండలంలో 8,032 మంది పిల్లలకు మాత్రలను పంపిణీ చేసినట్లు డాక్టర్ నిఖిత తెలిపారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ నర్సింహ రెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మండల కేంద్రంలో..

కొందుర్గు: మండల కేంద్రంలోని పాఠశాలల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ అమృత జోసెఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు సోమవారం ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నులిపురుగులను నివారిద్దాం

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

చేవెళ్ల: నులిపురుగుల నివారణే లక్ష్యంగా ప్రభుత్వం నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేస్తోందని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మండలంలోని ఆలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులకు నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలు వేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు ఈ మాత్రలు వేశారు. విద్యార్థులలో నులిపురుగుల సమస్య నివారణకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కార్యమక్రమంలో మండల వైద్యాధికారులు, పాఠశాల ఉపాధ్యాయులు, మండల నాయకులు, అధికారులు విద్యార్థులు పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణే లక్ష్యం

షాద్‌నగర్‌రూరల్: నులిపురుగులను నివారించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. సోమవారం ఫరూఖ్‌నగర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ విజయలక్ష్మి ఆధ్వర్యంలో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 1 నుంచి 19 సంవత్సరాల వయస్సు ఉన్న విద్యార్థులకు తప్పనిసరిగా ఆల్బెండజోల్ మాత్రలను వేయాలని సూచించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల అభివృద్ధిలో భాగంగా ఉపాధ్యాయుల కోరిక మేరకు దాదాపు కోటి రూపాయలతో 3 అదనపు తరగతి గదులు, ప్రహరీ నిర్మించనున్నామని స్పష్టం చేశారు. అనంతరం డాక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ.. నులిపురుగుల కారణంగా చిన్నారుల్లో రక్తహీనత, శారీరక, మానసిక అభివృద్ధిపై ప్రభావం చూపుతుందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహ్మద్‌అలీఖాన్ బాబర్, నాయకులు కృష్ణారెడ్డి, చల్లా శ్రీకాంత్‌రెడ్డి, బాల్‌రాజ్‌గౌడ్, గడ్డం శ్రీనివాస్‌యాదవ్, అగ్గనూరు బస్వం, ఎండీ. ఇబ్రహీం, గంగాధర్‌తిలక్, శ్రీనునాయక్, పురుషోత్తంరెడ్డి, కరుణాకర్, ఖాదీర్, అశోక్, ఫిజికల్ డైరెక్టర్ రాజశేఖర్, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, హెల్త్ సూపర్‌వైజర్లు అమృత, సువర్ణ, ఉపాధ్యాయులు, ఏఎన్‌ఎంలు, ఆశలు తదితరులు పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణ మాత్రలు వేయించాలి

షాబాద్: చిన్నారులకు నులిపురుగు నివారణ మాత్రలు వేయించాలని ఎంపీడీఓ అపర్ణ, ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు వేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బాల్‌రాజ్, డాక్టర్ ప్రభాకర్, సూపర్‌వైజర్ మెర్లిన్, ఆశవర్కర్లు, పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు ఉన్నారు.



షాద్‌నగర్‌రూరల్: విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



చేవెళ్ల: ఆలూరు పాఠశాలలో విద్యార్థులకు మాత్రలు వేస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య



షాబాద్: విద్యార్థులకు మాత్రలు వేస్తున్న ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్, ఎంపీడీఓ అపర్ణ